# నా రాజీనామా

సంతకం పెడుతున్నప్పుడు నా చేయి వణికింది. ఆ క్షణం గుండె ఆగింది. కళ్లల్లో నీళ్లు నిలిచేయి.

నా స్థితిని చూసి శ్రీధర్ నన్ను దగ్గరకు తీసుకున్నాడు. నా నడుం చట్టూ మొగలినాగులా బలమైన చేతులు. అతని చేతులకు నా దిగులును కరిగించే శక్తి లేకపోలేదు.

మంచంపై పసిబిడ్డ కేర్ మన్నాడు.

నా నడుంని అతని చేతులు వదిలేసాయి. బాబుని ఎత్తుకున్నాను. చంటి వెధవ ఎత్తుకోగానే ఏడుపు ఆపేసాడు.

శ్రీధర్ బాబుని ముద్దులాడి, ఆఫీసుకు బయల్దేరాడు. నా రాజీనామా ఉత్తరాన్ని తీసుకెళ్లడం మర్చిపోలేదు. శ్రీధర్ వెళ్లిపోయేక నాలో నీరసం నిస్సత్తువ ఆవహించి మంచంపై కూలబడిపోయేను. తను తీసుకుపోయిన కాగితపు మడతల్లో నా ప్రాణాలున్నాయి. ఉద్యోగానికి రాజీనామా చేయడం నన్ను అధికంగా బాధిస్తోంది. దుఃఖం వస్తోంది. నేనేమైనా తొందరపడ్డానా?

నా ఉద్యోగాన్ని ఎంతో గాఢంగా ప్రేమించేను. నా కెరీర్‌ను నాకు నచ్చేరీతిలో నిర్మించుకుని హఠాత్తుగా నేను చేసిన పనేమిటి?

శ్రీధర్ ప్రేమ వలలో పడిపోయేను. తొందరపాటా. ప్రేమతో చెట్టాపట్టా లేసుకుని...హాయిగా సాగిపోకుండా, పెళ్ళి కోసం తొందరపడ్డానా. పెళ్ళికోసం నా తల్లిదండ్రులను నేను, తన తల్లిదండ్రులను అతడు ఎదిరించి, పోరాడి వాళ్లను వదులుకోవడం పొరపాటా. తొందరపాటా. వాళ్లతో సత్సంబంధాలుండి వుంటే... నేనిలా ఉద్యోగం వదులుకునే పరిస్థితి ఉత్పన్నమయ్యేదా.

ఏం చేయడం? కులంతో వచ్చిన పేచీ. నేను మాల. శ్రీధర్ బ్రాహ్మడు.

మేమిద్దరం ప్రేమించి పెళ్ళిచేసుకోవడం తొందరపాటా. ఏమీ ఆలోచించకుండా, ముందు చూపు లేకుండా, ఏడాదికే బిడ్డను కనీయడం మాత్రం పొరపాటే. అవును అది కచ్చితంగా తొందరపాటే.

ఏ మాత్రలో మింగుతూ, తల్లిని కాకుండా, కనీసం జాగ్రత్తలు తీసుకోకపోవ డం తలచుకుంటుంటే, ఇప్పటికీ నాకు సిగ్గు కలుగుతుంది. నిజానికి బిడ్డను కోరుకోలేదు. అయితే పుట్టే బిడ్డను ఆబార్షన్‌తో తొలగించుకోదల్చుకోలేదు.

నా కడుపులో బిడ్డ నెల నెలా పెరుగుతున్నకొలదీ, మా అమ్మ నాన్నలపై ధ్యాస ఎక్కువయ్యేది. నెలలు నిండి, నొప్పులు పడుతున్నప్పుడు అమ్మ కోసం ఏడ్చేను. ఫోన్ చేసినా, స్నేహితులతో కబురుపెట్టినా రాకుండా మొండిగా బండరాళ్లయి పోయారు. నా పురుడు పోసిన పుణ్యాత్ముడు శ్రీధరే. వాళ్లను నేను మిస్ అవ్వడం కాదు, వాళ్ళే నా బంగారు తండ్రిని మిస్ అయ్యేరు. నా బోసి నవ్వుల బాబుని ఎత్తుకుని, గుండెలపై తన్నించుకుని పొందే ఒక అద్భుత అనుభూతిని, తీయని పారవశ్యాన్ని చేజేతులా కోల్పోయేరు అనుకుంటాను కసిగా.

నేను చేసిన తప్పు ఏమిటీ? కేవలం నా శ్రీధర్ బ్రాహ్మణుడైన కారణాన్న వాళ్లు దూరమయ్యేరు. నన్ను ప్రేమించిన కన్నవాళ్ళు, నేను ప్రేమించినవాడిని పెళ్ళి చేసుకోవడం సహించలేకపోయారు. ఎంత బాధాకర విషయం. వాళ్లకు కావల్సింది కూతురా? కులమా?

నాకు ఊహ వచ్చినప్పటి నుంచీ... ఎందుచేతనో కులాన్ని ప్రేమించలేక పోయేను. కులమనే అక్షరాలకీ దూరంగా ఉండడానికే ప్రయత్నించేను.

మా నాన్న ప్రభుత్వ కార్యాలయంలో ఒక పెద్ద ఆఫీసరు. మహానగరంలో పోష్ లొకాలిటీలో, విశాలమైన పెద్ద భవనం మా ఇల్లు. నాకు ఒక తమ్ముడు, చెల్లెలు ఉన్నారు. నా బాల్యం బాగానే సాగింది. కులరహితంగా, పిల్లలందరితో ఆడుకున్నాను. ఏ ఒక్కరూ ఏ ఒక్కరోజు నా కులంతో వాళ్ళు ఆడుకోలేదు. నన్ను ఏడిపించలేదు. దూరంగా ఉంచలేదు. కాన్వెంట్ చదువులకు కారులో వెళ్లేదాన్ని. చదువులో ముందు ఉండేదాన్ని. కాలేజీ రోజులను కూడా బాగా ఎంజాయ్ చేశాను. అస్పృశ్యత నా జోలికి రాలేదు. ఎటువంటి అవమానాలకి గురికాలేదు- నాకు తెల్సి. బహుశా సంపన్న శ్రేణికి చెందిన దాన్నవడంచేత, ఎటువంటి కులవివక్షకి దొరికిపోలేదనుకుంటాను.

దానికి నాన్న ఒప్పుకోడు.

"నీవు అమాయకురాలివి తల్లీ, ఎదుటి మనిషిని గబుక్కున నమ్మేస్తావు.

వాళ్ల నవ్వు నిజమనుకుంటావు. వాళ్ల మాట నిజమనుకుంటావు. నీ స్నేహితులు నీతో నవ్వుతూ తిరుగుతున్నా మానసికంగా నిన్ను ముట్టుకోరు. అన్‌టచ్‌బుల్‌వే. నీవది గ్రహించలేవు" అంటూ నా స్నేహితురాలు సునీత ప్రవర్తనని, నాకు బయటకు తీసి చూపిస్తే తెల్లబోయేను.

అదేమిటంటే ఒక శుభోదయాన నా స్నేహితురాళ్లు సునీత, రాణి, గీత, మా ఇంటికి వచ్చేరు. మా అమ్మ శుభ్రత పాటిస్తూనే అందరికీ ఆప్యాయంగా ఉప్మా పెసరట్టు పెట్టింది. రాణి, గీత శుభ్రంగా తిన్నారు. సునీత తినలేదు. కనీసం మంచినీళ్లు కూడా తాగలేదు. ఏమీ అనుకోవద్దు నా కడుపు బాగోలేదు అన్నది. అది నవ్వుతూనే మా ఇంట్లో ముళ్లమీద కూర్చున్నట్లు కూర్చున్నది. నేను గమనించలేదు. మా నాన్న గమనించేడు.

వాళ్లు వెళ్లిపోయేక నాన్న నన్ను పిలిచి సునీత కులం ఏమిటని అడిగేడు. అదేమి సంస్కారం? నాకు కోపం వచ్చింది.

సునీత కులం నాకు తెలీదన్నాను. నిజంగానే నాకు తెలీదు.

"కానీ నీ కులం ఏమిటో సునీతకు తెల్సు. అందుకే మనింట్లో మంచినీళ్లు కూడా ముట్టుకోలేదు" అన్నారు. మరసటి రోజు కాలేజీలో సునీతను నిలదీసి అడిగేను. రాస్కెల్, మా నాన్న అన్నది నిజమేనని ఒప్పుకుంది. అసహ్యం వేసి ఆ రోజు నుంచి దానితో మాటాడటం మానేశాను.

ఆ సందర్భంగా, నాన్న నాకు చిన్నక్లాసు పీకేడు.

"పట్టణాల్లో అస్పృశ్యత ఉన్నట్టు కనిపించదు తల్లీ కాని ఉంటుంది. చాపకింద నీరులా ఉంటుంది. చూడు తల్లీ, నేను మంచి పొజిషన్‌లో, హోదాలో ఉన్నానా. నా కొలిగ్స్ ఏ ఒక్కరూ నన్ను ఫేమిలీతో రమ్మని వాళ్ల ఇళ్లకి ఆహ్వానించరు. నేను ఆహ్వానించినా, మరోసారి వస్తామని కుంటి సాకుతో తప్పించుకుంటారు. పెళ్ళిళ్లకీ, పార్టీలకీ అందరితోపాటు నన్నుకూడా పిలవడం పిలుస్తారు. అక్కడ కూడా దూరం గానే ఉంచుతారు. 'హలో' అంటూ కృత్రిమ పలకరింపులూ, నవ్వులూ ఉంటాయి. అంత వరకే. మనతో ఒక పెద్ద డ్రామా ఆడేస్తారు. అస్పృశ్యత పల్లెల్లో ప్రత్యక్షంగా ఉంటుంది. ఇక్కడ పరోక్షంగా ఉంటుంది. మన నీడనీ, గాలినీ అసహనంగా సహించడమో భరించడమో చేస్తారు."

అలా అనగాలే నా ఒళ్లు జలదరించింది. తల తిరిగిపోయింది. మనుషులు అంత నీచంగా వక్రంగా, సంస్కార రహితంగా ఉంటారా? వందమందిలో ఒకరి ద్దరూ ఉండొచ్చేమో. నాన్నకి మాత్రం వందమందీ అలానే కన్పిస్తారు. నాన్న

దృష్టే అంత. పచ్చకామెరులు.

అగ్ర కులస్తులంతా మా నాన్నకి శత్రువుల్లాగే కన్పిస్తారు. అదొక కాంప్లెక్సు. అందులోనూ బ్రాహ్మణులను చూస్తే మరింత రెచ్చిపోతాడు నాన్న. ఆ సమయంలో తనూ ఒక సర్కారీ బ్రాహ్మణుడన్న విషయం మర్చిపోతాడనుకొని నవ్వుకుంటాను.

నాన్న చుట్టూ ఎప్పుడూ నలుగురైదుగురు చేరుతూనే ఉంటారు. వాళ్లంతా దళితులే. (హరిజనులు వలే దళితులు అనే పదం కూడా ఉపయోగించరాదనే విషయం ఈ మధ్య పేపర్లో చూసేను) మా నాన్న చుట్టూచేరేది మాలలే. వర్గీకరణ కోసం పోరుతున్న మాదిగలు రాలేరు కదా. మాల, మాదిగల మధ్య చిచ్చురేగడానికి కారణం నిస్సందేహంగా అగ్రవర్ణాల వ్యూహాత్మక కుట్రే అంటాడు నాన్న.

బ్రాహ్మణులకు సంబంధించి మిత్రులకు తను ఎలాంటి హెచ్చరిక చేస్తాడంటే 'నడిచే తోవలో నీకు ఒక పాము, పంతులు కన్పిస్తే, ముందుగా నీచేతి కర్రతో కొట్టి చంపాల్సింది పాముని కాదు, పంతుల్ని' అంటారు నాన్న. బ్రాహ్మణద్వేషి అయిన నాన్నకి అల్లుడిగా బ్రాహ్మణుడినే తీసుకు వచ్చేను. ఎలా ఉంటుందిక ఇంట్లో పరిస్థితి! ప్రచండ యుద్ధం. నయానా, భయానా ఎన్ని విధాలుగా నా పెళ్లి ఆపడానికి ప్రయత్నాలు చేయవచ్చో అన్ని ప్రయత్నాలు చేసేడు నాన్న. నేను గట్టిగానే నిలబడి పోట్లాడేను. అటు శ్రీధర్ పై అటాక్ చేసేడు. చంపేస్తానన్నాడు నాన్న. తను బెదిరిపోలేదు. చివరకు పోలీస్ స్టేషన్ వరకూ వెళ్లింది. మా నాన్న ఎంత ఆగ్రహంతో చిందులు తొక్కినా మా పెళ్లిని ఆపలేకపోయేడు.

నా పెద్దకూతురు చచ్చింది అని డిక్లేర్ చేసి, నేను అడుగు పెట్టనీయకుండా ఇంటి తలుపులు మూసేశాడు నాన్న. అంతకన్నా ఏం చేయగలడు? ఎంతకాలం చేయగలడు?

నాన్నతో నాకెప్పుడూ పోట్లాటే.

రిజర్వేషన్ల జోలికి వెళ్లకుండా, కేవలం ప్రతిభతో చదువులో ముందుకు సాగేదాన్ని. ఎంసెట్‌లో మంచిర్యాంక్ తెచ్చుకుని ఓసి కౌన్సిలింగ్‌లో గర్వంగా మెకానికల్ ఇంజనీరింగ్ సీటు తెచ్చుకున్నాను. నాన్న ఎంత మొత్తుకున్న ఎస్సీలకు ప్రత్యేకంగా పిలిచే కౌన్సిలింగ్‌కి వెళ్లలేదు. వెళితే నాకు మరింత మంచి కాలేజీలో ఎంచక్కా ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ ఇంజనీరింగ్ విభాగంలో సీటు వచ్చి ఉండేదని గోలగోల పెట్టేసాడు నాన్న. గుండెలు బాదేసుకున్నాడు నాన్న.

"నాన్న! ఏమిటిది. మెరిట్‌తో తెచ్చుకున్న సీటుతో నేను చాలా సంతృప్తి చెందాను. మీరెందుకు తృప్తి చెందరు? ఎందుకంత మెలికలు తిరిగిపోయి బాధపడి

పోతారు? అయినా సంపన్న శ్రేణికి చెందిన మనం రిజర్వేషన్లను గెద్దల్లా అందినంత మేరకు అందేసుకుంటున్నాం. అవునా? నేను ఉపయోగించుకోకపోవడం వల్ల, ఆ అవకాశం మరొక యస్సీకి కచ్చితంగా లభిస్తుంది కదా. ఆవిధంగా, విశాలంగా ఎందుకు ఆలోచించవు? నువ్వు నాకు నాన్నవేకాదు. నగర యస్సీ సంఘానికి అధ్యక్షుడ్వి కూడా. అది గుర్తించుకో" అంటే నాపై అంతెత్తున ఎగిరి పడ్డాడు నాన్న.

సంపన్న శ్రేణి అన్న మాటను తట్టుకోలేక పోయేడు నాన్న.

"కులంలో సంపన్నులేమిటి; లేనివాళ్లు ఏమిటి. కులం అంటే కులమ్. దట్సాల్. సంపన్న శ్రేణి అంటూ సుప్రీం కోర్టులూ, దగాకోరు మనుషులూ మనపై ఏడుస్తూ కూసే కారు కూతలవి. రాజ్యాంగపరంగా ఎస్.సి, ఎస్.టిలలో సంపన్న వర్గమంటూ ఒకటి లేదు. దానికి ప్రభుత్వ మద్దతు కూడా లేదు. రిజర్వేషన్లకు మూలం ఆర్థిక ప్రాతిపదిక కాదు. సామాజిక వెనుకబాటు. అది తెల్సుకో" అన్నాడు నాన్న.

అంటే మనం సంపన్నశ్రేణికి చెందిన వాళ్లం అయినప్పటికీ... సామాజికంగా వెనుకబడిపోయిన వాళ్లమన్నమాట. అంచేత కిందస్థాయి వరకూ వెళ్లనీయకుండా, నిజంగా అవసరమైన వాళ్లకి దక్కనీయకుండా,అడ్డంగా నిలబడి రిజర్వేషన్ ఫలాలు అన్నీ మనమే సుబ్బరంగా ఆరగించేస్తామన్న మాట.

బాగుంది నాన్న మిమ్మల్ని తప్పుపట్టడం కాదు. ఈ వ్యవస్థే అలా ఉంది. మాల మాదిగలేకాదు ఎన్నెన్నో కులాలు 'వెనుకబాటుతనం జిందాబాద్' అంటున్నాయి. 'మమ్మల్ని వెనుక బడిన కులాలుగా గుర్తించండోయ్' అంటూ గోల, గగ్గోలు పెట్టేస్తున్నాయి. మమ్మల్ని గుర్తించకపోతే చూసుకోండి ఉద్యమాలూ, ఊరేగింపులూ, ధర్నాలూ అంటున్నాయి. నాకు తెలీక అడుగుతా. మన అభివృద్ధి అంటే వెనుకబాటు తనమా నాన్నా. ఇంతటి చైతన్యం కేవలం మన దేశంలోనే ఉన్నందుకు మనం గర్వపడాలి కదు నాన్నా.

మరో పదేళ్ల తర్వాతయినా, పోనీ వందేళ్ల తర్వాతయినా రిజర్వేషన్లపై లక్ష్మణ రేఖ గీసే దమ్మూ, ధైర్యం ఈ దేశ రాజకీయ నాయకులకు ఉందా నాన్నా.

మూలాలను పట్టుకుని, నిర్మాణాత్మకంగా వెనుకబాటుతనాన్ని, ఆర్థిక అసమానత్వాన్ని ధ్వంసం చేయకుండా ఈ సోకాల్డ్ రిజర్వేషన్లను ఎంతకాలం వెనకేసుకొస్తారు నాన్నా" అన్నాను నాన్నకన్నా ఆవేశంగా.

"ఏమంటాను తల్లీ నువ్వు కాలేజీకి వెళ్లి చదువులు వెలగబెట్టకుండా ఏ

రాడికల్ సంస్థలతోనో స్నేహం చేసి పూర్తిగా చెడిపోయేవని ఏడ్వటం తప్పా నేనేం చేయ గలను తల్లీ" అన్నాడు నాన్న.

నాన్నతో నాకెప్పుడూ పోట్లాటే. నన్ను అన్నివిధాల భరించేడు. బ్రాహ్మణుడిని పెళ్ళిచేసుకున్నాక, మరిక భరించలేకపోయేడు. నేను పూర్తిగా భ్రష్టు పట్టుకుపోయాననే భావనతో, ఇక ఏ పోట్లాటలూ లేకుండా, ఏకంగా తెగతెంపులే చేసుకుని, కూతురే లేదనుకున్నాడు నాన్న.

గతాన్ని నెమరువేస్తూ, నడుం వాల్చి, కళ్లుమూసుకున్నాను. కాలింగ్‌బెల్ చప్పుడుకి చప్పున లేచేను.

పడుకున్న బాబు కదిలేడు గాని, నిద్రా భంగం కాలేదు. మరోసారి చప్పుడు కాకముందే, పరుగున వెళ్లి తలుపు తీసేను.

మీనాక్షి!

తెల్లగా ఉంది. సన్నంగా ఉంది. కాస్త పొడుగ్గా ఉంది. వయస్సు ముప్పయి ఆరు. మా చీఫ్ ఇంజనీర్ వద్ద పర్సనల్ సెక్రటరీ, నాతో కొంత స్నేహం ఉంది.

మీనాక్షిని లోనకి సాదరంగా ఆహ్వానించేను. కూర్చుంది. మంచినీళ్లు తాగించి. నీ వెలాగున్నావు, బాబు ఎలా ఉన్నాడు ఇలాంటి క్షేమ సమాచారాలు పక్కన పెట్టి, తన వానిటీ బాగ్‌లోంచి నా రాజీనామా ఉత్తరాన్ని బయటకు తీసి, టేబుల్ పై పెట్టి –

"నీ రాజీనామాను యాజమాన్యం ఆమోదించలేదు. అందుకే తెచ్చేసేను" అన్నది మీనాక్షి.

విస్తుపోయేను. "ఎందుచేత ఆమోదించలేదు" అనడిగేను.

"ఒక సిన్సియర్ ఎగ్జిక్యూటివ్‌ని కంపెనీ ఎలా వదులుకుంటుందీ? చీఫ్ ఇంజనీర్ రావుగారు నీ ఉత్తరం చూసి చికాకు పడ్డారు. తను ఢిల్లీ టూర్ అర్జెంటుగా తగిలి వెళ్లిపోయారు. లేకుంటే నిన్ను ఇమిడియట్‌గా కౌన్సెలింగ్‌కి పిలిచేవారు. ఢిల్లీ వెళ్లిపోతూ ఆ ఉత్తరం సంగతి చూడమని నన్ను ఆదేశించారు. రావుగారు ఆదేశించిక పోయినా, రావాలనే అనుకున్నాను వచ్చాను" అన్నది మీనాక్షి. కంపెనీ పక్కనే కాలనీ ఉంది, నా నివాసం అక్కడే.

"అనివార్య కారణాల వల్ల రాజీనామా. ఏమిటా కారణాలు?

శ్రీధర్‌ని అడిగితే – చాలా ఉన్నాయి కాని ముఖ్య కారణం బిడ్డ సంరక్షణ. రాజీనామా అనివార్యం అన్నాడు. నేను చెప్పింది ఏమీ వినిపించుకోలేదు. నువ్వయినా వినిపించుకుంటావా" అన్నది మీనాక్షి.

"వినడానికేముంది చెప్పు" అన్నాను నవ్వుతూ.

"బిడ్డ సంరక్షణ కోసం నువ్వు జాబ్ రిజైన్ చేయడం సిల్లీగా కన్పిస్తోంది. చాలా చిన్న విషయానికి, ఫూలిష్‌గా నీవు కూర్చున్న కొమ్మను నీవే నరుక్కుంటున్నట్టుగా భావిస్తున్నాను. ఇది ఊరా? అడివా? రోజూ ఒక ఎనిమిది గంటలు నీబిడ్డను చూసేవాళ్ళు ఈ ప్రపంచంలో లేరా" అని ఆశ్చర్యం ప్రకటించింది మీనాక్షి.

"నాకు మటుకులేరు" అని తెలియజేసాను – "మన కంపెనీలో చైల్డ్ కేర్ సదుపాయం లేదు. నగరంలో రెండు, మూడు ఉన్నప్పటికీ చెప్పుకోతగ్గవి కాదు. సరే ఏదొకటి అందులో పడేద్దాం అనుకుంటే మనకాలనీ నగరానికి ఇరవై మైళ్ల దూరంలో ఉంది. నా బిడ్డను అంతదూరంలో ఉంచి నేను ఉద్యోగం చేయలేను.

పోనీ ఇంట్లో పనిపిల్లనో, ఆయానో పెట్టుకుంటే బాగుంటుంది. కాని వాళ్లు దొరకరు. దొరికినవాళ్లు మనకి నచ్చరు. నమ్మలేము, నమ్మకమైనవాళ్లు దొరకడం కష్టం. రాజీపడి బిడ్డను ఎవరిచేతుల్లోనో పెట్టేయడం శ్రీధర్‌కి ఇష్టంలేదు. అటు అమ్మగాని, అత్తగాని, ఇతర ఏ బంధువర్గం గాని మాకు అందుబాటులో లేరన్న విషయం నీకు తెలియంది కాదు.

అంతేకాకుండా ఏడ్చే నా బిడ్డకి నా పాలు పట్టకుండా... ఎవరిచేతో డబ్బా పాలు మింగించలేను. ఆఫీసులో నా వక్షం బరువై, నొప్పి కలిగిస్తే, టాయిలెట్‌కి వెళ్లి నా పాలను పిండి వాష్‌బేసిన్ పాలు చేయలేను, పని పట్ల ఏకాగ్రత చూపలేను... నేను రాజీనామా చేయడానికి ఈ కారణాలు చాలవా" అన్నాను.

"జయా! నేనూ ఆడదాన్నే. నాకూ పిల్లలున్నారు. నీ బాధను అర్థం చేసుకోగలను. నీకు నీ బిడ్డ బాగోగులు కావాలి. కంపెనీకి నీ సర్వీస్ కావాలి. బిడ్డ, ఉద్యోగం దేని ప్రాధాన్యత దానిదే. నేను అనేదేమంటే బిడ్డను నువ్వే సాకుతూ నీ ఉద్యోగం కొనసాగించవచ్చు".

"అదెలా సాధ్యం"

"మరేం లేదు. రాజీనామా చేయకుండా నీ సెలవు కంటిన్యూ చేస్తావు. మెటర్నటీ లీవు అయిపోతే నీకున్న ఎర్న్‌డు లీవు పెట్టు. నీకు లీవు బేలన్సు చాలా ఉంది కూడా".

"అదైనా ఎంతకాలం? తర్వాతయినా తప్పదు కదా ఉద్యోగానికి తలాక్"

"అప్పుడు చూద్దాం. రేపు ఎలా ఉంటుందో ఈరోజే ఎలా చెప్పేయగలం"

"నువ్వన్నది బాగానే ఉందనుకో.. శ్రీధర్ వచ్చేక తనతో మాటాడి ఏసంగతీ నీకు చెబుతాను"

చురుగ్గా చూసింది నావైపు మీనాక్షి.

"జీవితంలో నీవు తీసుకున్న విప్లవాత్మక నిర్ణయాలు చూసి నేను అబ్బురం చెందేను, గర్వించేను... ఈ రోజు నువ్వు కొత్తగా కాదు... పాతకాలపు ముసలమ్మలా కన్పిస్తున్నావు. అవున్లే ఎంతటి స్త్రీ అయినా పెళ్ళి అయ్యేక మొగుడు యజమాని, తను బానిస. మొత్తానికి నీకు సంబంధించిన విషయాలు నీ మొగుడు తేల్చవలసిన స్థాయికి పడిపోయేవన్నమాట" నవ్వుతూనే నాకు చురక అంటించింది.

మీనాక్షి అన్నది నిజమే అనిపిస్తోంది.

శ్రీధర్ నన్ను రిజైన్ చేయమన్నాడు. మంచి ఆలోచనే అనుకున్నాను. కాగితం పెట్టేను. మీనాక్షి రిజైన్ చేయొద్దు లీవు పెట్టు అంది. ఇదీ మంచి ఆలోచనే అనుకున్నాను. తను అన్నట్టు నా గురించి నేను ఆలోచించుకునే స్థితిలో లేనా. నాపై నాకే చిరాకు వేసింది.

రాజీనామా ఉత్తరాన్ని వెనక్కి తీసుకున్నాను.

కలం తీసుకుని లీవు ఎక్స్‌టెండ్ చేస్తూ, లీవు లెటర్‌పై సంతకం పెట్టి ఇచ్చేను.

బాబుని ముద్దులాడి, లీవ్ లెటర్ తీసుకుని మీనాక్షి వెళ్లిపోయింది.

***

శ్రీధర్ సాయింత్రం ఆఫీస్ నుంచి ఇంటికి రాగానే... రోజులానే వంటగదికి వెళ్లి, టీకాచి, కప్పులో వేసి, తీసుకొచ్చి టేబుల్‌పై పెట్టేను.

టేబుల్‌పై టీ పక్కనే, నా రాజీనామా కాగితం పడి వుండటం చూసేడు.

'ఇదేమిటి? ఇక్కడుంది?" అనడిగేడు.

టీ తాగమని చెప్పి, తను టీ తాగేలోపుగా జరిగిన విషయం చెప్పేను.

'ఇట్స్ ఓకే. ఈ ఆలోచనా బావుంది మంచిపనే చేశావ్' అని అంటాడనుకున్నాను. "ఇంత వ్యవహారం జరిగితే... నేను అడిగిందాక నీవు చెప్పలేదు. అవున్లే నీ ఉద్యోగ విషయం నాకెందుకు చెప్పాలి?" అన్నాడు.

"అదేమిటి శ్రీధర్. అలా మాటాడతావ్... ఏదీ, నువ్వు ఇప్పుడేనా వచ్చేవు. వచ్చి నీవింకా టీ అయినా తాగలేదు. ఏది జరిగినా నీకు చెప్పకుండా ఎట్లా ఉంటాను?" అతను అలా మాటాడటం నాకు బాధ కలిగించింది.

"సర్లే. చెప్పాలనుకున్నదానివైతే.... రాజీనామా కాగితాన్ని వెనక్కి తీసుకోక ముందే చెప్పేదానివి. నేనొక ఫూల్‌ని... ఉదయం నీ ఉత్తరాన్ని ఆఫీసుకి తీసుకు వెళ్లిన ఒక మెసంజర్ని. అంతే. నీ ఫ్రెండ్ నీ దగ్గరికి రాకముందే నన్ను కౌన్సెలింగ్

చేసింది. నీకు చెప్పిన సలహాయే నాకూ చెప్పింది. ఒప్పుకోలేదు. నేను 'నో' అన్న దానిని నువ్వు 'ఎస్' అన్నావు. మీనాక్షి గెలిచింది. రేపు నేను ఆఫీసుకి వెళ్లేక... ఆవిడ నావైపు చూసే చూపుకి... నాతల ఎక్కడ పెట్టుకోవాలి? నీవు విలువ ఇచ్చింది నీ మొగుడికి కాదు. కచ్చితంగా మీనాక్షికే.

ఆవిడకెందుకు నీపట్ల అంత గాఢమైన ప్రేమ, స్పెషల్ ఇంట్రెస్టూ? మూడు నెలల కిందట మన కొలిగ్ స్వప్న నీలాగే రిజైన్ చేసింది కదా. మీనాక్షమ్మ స్వప్నతో నీకన్నా ఎంతో క్లోజ్‌గా మూవ్ అవుతుంది కదా. అంతటి స్నేహితురాలను, నిన్ను ఆపినట్టుగా ఎందుకు ఆపలేకపోయింది? ఆపదు. ఆపవలసిన అవసరం లేదు. ఎంచేతంటే స్వప్నది మీనాక్షి కులం కాదు కాబట్టి" అనేసి విసురుగా బయటకు వెళ్లిపోయేడు శ్రీధర్.

స్టన్ అయిపోయేను.

శ్రీధర్ కొత్తగా కనిపించేడు. పురుషాధిక్యమా. కులాధిక్యమా. తను అలా మాటాడకుండా చాచిపెట్టి చెంపదెబ్బ కొట్టినా అంతగా హర్ట్ అయ్యేదాన్ని కాదేమో.

ఆ రాత్రి, చాలా సేపటికి ఇంటికి చేరేడు శ్రీధర్. అతని ముఖం పాలిపోయి ఉంది. నా దగ్గిరకు వచ్చి, హీన స్వరంతో 'నన్ను క్షమించు జయా' అన్నాడు.

నేను క్షమించలేదు. ఊర్కోలేదు. అతని ప్రవర్తనపై ముఖ్యంగా కుల ప్రస్తావన పై విరుచుకుపడ్డాను. ఎందుకలా వాగేవని నిలదీశాను.

"జయా నా ప్రవర్తనకి సిగ్గు పడుతున్నాను. అలా నోరు జారడం క్షమించరాని తప్పే, ఒక సామాజిక అస్తిత్వాన్ని వెలికితీసి, అందులో సున్నితత్వాన్ని విస్మరించి కరకుగా, హేళనగా మాటాడేను. నిన్ను అవమానించేను. నాపై నాకు అసహ్యం వేస్తోంది. నన్ను దయచేసి క్షమించు" అన్నాడు.

ఏమంటానిక?

***

కొన్ని రోజులు గడిచేక-

ఒక కొత్త ప్రపోజల్‌తో హుషారుగా ఇంటికి వచ్చాడు శ్రీధర్. కొత్త ఉద్యోగం. కొత్త కంపెనీ. కొత్త ఊరు.

ఇ.ఐ.ఎల్. సంస్థ మేము ఎగ్జిక్యూట్ చేసే చాలా ప్రాజెక్టులకు ఇంజనీరింగ్ కన్సల్టెంట్. ఆ సంస్థ అధికారి ఒకరు శ్రీధర్ పనిలో చూపే సృజనాత్మకత, శక్తి సామర్థ్యాలను చూసి 'నీలాంటివాడు మాకు కావాలి. మా కంపెనీకి వచ్చేయ కూడదూ' అని ఆఫర్ చేశాడు. 'రెండు, మూడురోజుల్లో పేపర్లో ప్రకటన వస్తుంది.

నీవు అప్లయ్ చేస్తే చాలు. ఉద్యోగం నీది' అన్నాడు.

అన్నట్టుగానే పేపర్లో ఉద్యోగ ప్రకటన వచ్చింది. ఇక అప్లయి చేయడమే. 'ఏమంటావు జయా' అనడిగేడు శ్రీధర్ నన్ను. "ఏమంటాను. మానసికంగా నువ్వు అప్పుడే ఇ.ఐ.ఎల్. మేనేజర్ కుర్చీలో కుర్చుండి పోయేవు. నీ ఉత్సాహంపై నేనెందుకు నీళ్లుజల్లుతాను. నీ యిష్టం" అన్నాను.

"మరి నువ్వు కూడా రిజైన్ చేయవలసి ఉంటుంది".

"సిల్లీగా మాటాడకు. నీవెక్కడుంటే నేనక్కడే" అన్నాను.

కథ అడ్డం తిరిగింది.

ఇ.ఐ.ఎల్. ఉద్యోగానికి ఎంతో ఉత్సాహంతో పెట్టిన శ్రీధర్ అప్లికేషన్‌ని కంపెనీ యాజమాన్యం ఫార్వార్డ్ చేయలేదు.

చీఫ్ ఇంజనీర్ రావుగారు శ్రీధర్‌ను పిలిచి కౌన్సెలింగ్ జరిపేరు.

"శ్రీధర్! ఇంజనీర్‌గా నువ్వు ఈ కంపెనీలో పుట్టి, పెరిగి ఇంతటి వాడివ య్యేవు. ఎక్విప్‌మెంట్ డిజైన్ స్పెషలైజేషన్‌కి నిన్ను జర్మనీ తొమ్మిది నెలలు పంపిన విషయాన్ని నీవు జీవితాంతం గుర్తు ఉంచుకోవాలి. మెరికల్లాంటి ఉద్యోగుల ను కంపెనీ వదుల్కోదు. నీ సర్వీస్‌ని కంపెనీ కోల్పోదు. అదే సమయంలో నీ కెరీర్‌పై నీళ్లు జల్లి నిరాశ పర్చదలుచుకోలేదు. ఇ.ఐ.ఎల్. ఆఫర్ చేయబోతున్న ఉద్యోగాన్ని ఇక్కడే నీకు పదోన్నతి కల్పించి ఇస్తే నీకు సమ్మతమేనా".

"అయ్యో! అదేమిటి సర్. అది నాకు అద్భుతానందాన్ని ఇస్తుంది. అంతకన్నా ఇంకేమి కావాలి సర్. థాంక్యూ సర్" అంటూ తన అనుమానాన్ని బయట పెట్టేడు శ్రీధర్..."సర్ ఈ ఏడాది డి.పి.సి.కి ఎలిజిబుల్ కాను. నాలుగు నెలల సర్వీసు తక్కువ".

రావుగారు నవ్వుతూ "నీకు ఎలిజిబిలిటీ కంపెనీ నిబంధనల ప్రకారం ఉన్నప్పుడు ఇక నా సాయం ఎందుకు? నువ్వే సాధించుకోగలవు. ఎనీవే ప్రమోషన్ల హడావుడి వారం, పదిరోజుల్లో ప్రారంభం కానుంది. సిద్ధంగా ఉండు బెస్టాఫ్ లక్" అన్నారు రావుగారు.

శ్రీధర్ ప్రమోషన్ ఎలిజిబిలిటీ విషయంలో స్పెషల్ నోట్ మూవ్ చేసి మేనేజింగ్ డైరెక్టర్ అప్రూవల్ తీసుకున్నారు రావుగారు. ఆ కంపెనీలో రూల్సుకి డీవియేషన్ అన్నమాట.

ఇదంతా శ్రీధర్ నాకు చెప్పగానే మహదానందం కలిగింది. నిజానికి తల్లి లాంటి సంస్థను వదలి ఇ.ఐ.ఎల్‌కి వెళ్లడం నాకిష్టంలేదు.

శ్రీధర్ మేనేజర్ అవుతాడు, అంటే ఒక ఇంజనీరింగ్ సెక్షన్‌కి ఆధిపత్యం వహిస్తాడు. ఇది విశేషమే. ప్రయివేట్ రంగంలో వలే ఒక పబ్లిక్ రంగ సంస్థలో మెరిట్‌ని అవుటాఫ్‌దివేలో ప్రమోట్ చేయడం అద్భుతమే. హాట్సాఫ్ టు చీఫ్ ఇంజనీర్ రావుగారూ అనుకున్నాను.

***

'కంగ్రాచ్యులేషన్స్' అంటూ రంగ ప్రవేశం చేసింది మీనాక్షి.

తను ఇంట్లో అడుగుపెట్టగానే... ఎందుకో... కాస్త కలవరపాటు చెందేను. ఆమె రాక... మళ్లీ శ్రీధర్‌తో మరో యుద్ధానికి దారి తీయదుగదా. నవ్వుకున్నాను.

మీనాక్షిది, నాది ఒకే కులం. మా కంపెనీలో అన్ని కులాలకీ సంఘాలు న్నాయి. మా కులానికీ సంఘం ఉంది. అందులో మీనాక్షి ఒక ఏక్టివ్ మెంబరు. జాయింట్ సెక్రటరీ అనుకుంటాను. నేను కుల సంఘంలో మెంబర్ని కాదు. ఆమెకు నా సంగతి తెల్సు. అంచేత ఏరకంగానూ కులానికి సంబంధించిన విషయాలు నాతో మాట్లాడదు.

మీనాక్షి నన్ను గట్టిగా కావలించేసుకుని కంగ్రాట్స్ రిపీట్ చేసింది. ప్రమోషన్ ఆర్డరు కవరు తీసుకువచ్చింది.

నా శ్రీధర్ అధికారికంగా ఒక మేనేజర్ అయ్యేడన్న మాట. నాకు చాలా సంతోషమయింది. ఆ శుభవార్త ఊహించినదే. ఇలా మీనాక్షి ద్వారా కాకుండా, శ్రీధర్ వచ్చి, నన్ను దగ్గరకు తీసుకుని చెబితే ఆ ఆనందం వేరుకదా.

ప్రమోషన్ ఆర్డర్ కవరు శ్రీధర్ చేతిలో పెట్టి, అభినందించాల్సిందిపోయి, ఏకంగా ఇంటికే పట్టుకొచ్చి నాకిస్తున్నదేమిటీ?

సందేహం లేదు. శ్రీధర్ అలుగుతాడు. కోప్పడతాడు. ప్రమోషన్ సరదా అంతా చంకనాకి పోతుంది. చప్పబడిపోతుంది అని భయపడ్డాను.

"ఇంత దూరం నీవు శ్రమపడి తేవడం ఎందుకూ. శ్రీధర్‌కి ఆఫీసులోనే ఇచ్చేయవచ్చు కదా"

"అయ్యో! శ్రీధర్‌కే ఇవ్వబోయాం తల్లీ తీసుకోలేదు. నీకిస్తే బాగుంటుంద న్నాడు".

అదేమి బాగు! ఇటు చూస్తే మీనాక్షి ఒక పట్టాన కవరు ఇవ్వదూ. ఇవ్వమంటే పార్టీ కావాలంది. "ఇస్తాను తల్లీ" అన్నాను.

"ఇంట్లో స్వీట్ ఉందా" అన్నది.

తెచ్చి ఎదురుగా పెట్టేను. ఒక కోవా బిళ్లను పూర్తిగా నా నోట్లో కూరింది.

నన్ను కూడా తన నోట్లో ఒకటి పెట్టమన్నది. పెట్టేను.

అంతవరకూ ఆ కవర్ నా చేతిలో పెట్టలేదు మీనాక్షి.

మొత్తానికి, కవరులోనున్న ఆఫీస్ ఆర్డర్ తీసి చదివేను.

చదివి దిగ్భ్రాంతి చెందేను. ఒక తీవ్రమైన షాక్ తగిలినట్టు, నిలబడే శక్తి కోల్పోయి ఒక్కసారిగా కుర్చీలో కూలబడిపోయేను.

నా చేతిలో కాగితం వణుకుతోంది. ఏమిటి? నామతి చలించిందా. అక్షరాలు తారుమారు. ఏదో గజిబిజి. నా చీర చెంగుతో ముఖం తుడుచుకుని చదివిందే మళ్ళీ మళ్ళీ చదివేను. నేను ఆశించింది ఆ కాగితంలో కానరాలేదు.

"మీనా! సమ్‌థింగ్ రాంగ్ అనిపిస్తోంది. ఏదో గ్రాఫిక్ ఎరెర్‌లా కన్పిస్తోంది. చూడూ... శ్రీధర్ పేరు ఉండాలి కదా... చిత్రంగా నా పేరు కన్పిస్తున్నదేమిటీ"

"ఏదో విషాద వార్త మోసుకొచ్చిన టెలిగ్రాం చదువుతున్నట్టు నీ ముఖంలో ఆ ఫీలింగ్ ఏమిటి తల్లీ. శుభవార్తను చేత్తో పట్టుకుని ఎందుకిలా కన్‌ఫ్యూజ్ అవుతావు? ఆఫీస్ ఆర్డర్‌లో ఉన్నది నీ పేరే. పదోన్నతి పొందినది అక్షరాలా నువ్వే. ఆ కాగితం చూడగానే థాంక్‌గాడ్ అనుకొని, గర్వంతో, ఆనందంతో గెంతులు వేయకుండా... అదేమిటే తల్లీ ఏదో పోగొట్టుకున్నట్టు ఆ విషాద వదనం" అంది మీనాక్షి.

"ముందు అడిగినదానికి సూటిగా సమాధానం చెప్పు, శ్రీధర్‌కి ప్రమోషన్ వచ్చిందా లేదా?"

"లేదు. శ్రీధర్‌కి ప్రమోషన్ రాలేదు"

"అదేమిటీ. శ్రీధర్‌కి రావలసిన ప్రమోషన్ కదా. ఏమిటీ గజిబిజి గందర గోళం."

"అదేమిలేదు– శ్రీధర్‌కి ఇవ్వలేదని బాధపడకు. నీకిచ్చారుగా సంతోషించు. శ్రీధర్‌లో సగభాగం నీవేకదా ఎవరు కొస్తేనేమిటీ. ఏ ఒక్కరు కొచ్చినా మీ ఇద్దరూ సంతోషించాలి, అవునా"

"నాకు ప్రమోషన్ ఏమిటే తల్లీ, నాకు బాధతో పాటు నవ్వుకూడా వస్తోంది".

"జయా! నిన్ను నువ్వు కించపరుచుకోవద్దు. పదోన్నతి పొందే అర్హత నీకు ఉంది. వందశాతం ఉంది. అవును మేనేజర్‌కి ఉండాల్సిన లక్షణాలు నీలో నిండు గా ఉన్నాయి. నీకున్న విషయ పరిజ్ఞానం, ప్రతిభాపాటవాల ముందు శ్రీధర్ నిలబడలేడనే విషయం డిపార్టుమెంట్‌లో అందరికీ తెల్సు. యాజమాన్యం గుడ్డిదీ, తెలివి తక్కువదీ కాదు. అన్నీ పరిశీలించే నీకు పళ్ళెంలో పెట్టి ఇచ్చేరు ప్రమోషన్.

జయా! నీకిచ్చిన ప్రమోషన్ ఆర్డర్‌ని నీవు నమ్మలేని స్థాయిలో ఉన్నావంటే... నిన్ను కాదు శ్రీధర్‌ని నిందించాలి, ప్రమోషన్ విషయమై రీసెంట్ డెవలప్‌మెంట్స్ ఏవీ నీకు చెప్పలేదు. ఎంత పెళ్లానివైనా, నువ్వొక తోటి ఉద్యోగివి. కంపెనీలో జరుగుతున్న విశేషాలు, విషయాలు నీకు తెలియజేయకపోతే ఎట్లా? నిన్ను నిజంగానే వంటింటి కుందేలుగా చేసేస్తున్నాడనిపిస్తోంది"- చాలా సీరియస్‌గా అన్నది మీనాక్షి.

ఆమె మాటలు నాలో కలవరం రేపేయి. అలజడి ఆందోళన కలిగించేయి. నిజమే తను అన్నదాంట్లో వాస్తవం ఉంది. ఈ మధ్య బొత్తిగా కంపెనీ సంగతులు చెప్పడం మానేశాడు. ఏమైంది శ్రీధర్‌కి? ఒకప్పుడు ఎన్నెన్ని కబుర్లు. కంపెనీ విషయాలు మాత్రమే కాదు దేశ సాంఘిక, ఆర్థిక రాజకీయ పరిస్థితులపై ఎన్నో కబుర్లు, వాదనలు, ఒక్కొక్కసారి వాదనలు ముదిరి, ఘర్షణ పడి, ఎడమొగం పెడమొగం... అంతలోనే నవ్వుకుని ఒకటైపోయేవాళ్లం. ఆ కబుర్లు ఇప్పుడేవి. ఆరోగ్యవంతమైన చర్చలు, వాదనలు, ఏవీ.

శ్రీధర్ పై కోపం వచ్చింది. కంపెనీ సంగతులేవి చెప్పకపోవడం వల్లేకదా... నా అనుమానాలూ యక్షప్రశ్నలూ బాణాల్లా మీనాక్షి పై సంధించవలసి వచ్చింది. ఈ విషయంపై శ్రీధర్‌తో పోట్లాట పెట్టుకోవాలని నిర్ణయించుకున్నాను.

వంటగదిలోకి వెళ్లి, కాచితెచ్చిన టీ మీనాక్షి తాగి, పదోన్నతి ప్రస్థానం వివరాలు తెలియజేసి నాకు వేడి పుట్టించింది. రోత కలిగించింది.

"ప్రమోషన్ల జాతరలో డి.పి.సి. నిర్వహించి వివిధ స్థాయిల్లో పదోన్నతులను పొందిన ఉద్యోగుల లిస్ట్ ఫైనలైజ్ చేసేరు. మేనేజర్ కేటగిరిలో ఒకే ఒక్కడు శ్రీధర్‌ని పదోన్నతికి నిర్ణయించేరు. యాజమాన్యం మరో రెండు మూడు రోజుల్లో ప్రమోషన్ ఆర్డర్లు రిలీజ్ చేయబోతుండగా...హఠాత్తుగా ఎస్సీ, ఎస్టీ కమిషన్ అధికారులు ఢిల్లీ నుంచి దిగిపోయేరు. దిగిపోయి సుడిగాలిలా చెలరేగిపోయేరు.

ఎన్నో అవకతవకలు బయటపడ్డాయి. రోస్టర్ ప్రకారం ఎస్సీ, ఎస్టీలకు ఉద్యోగాలు, పదోన్నతులు సరిగా అమలు పర్చకపోవడంతో కమిషన్ అధికారులు చిందులు వేసేరు. శివతాండవం చేసేరు.

రిజర్వుడు కోటా పూర్తిగా దుర్వినియోగం చేయబడడంతో రిలీజు చేయడానికి తయారు చేసిన పదోన్నతుల లిస్టుని సమగ్రంగా పరిశీలించేరు. అందులో కూడా ఎస్సీ ఎస్టీలకు చూపాల్సిన రీతిలో ప్రాధాన్యం కల్పించలేదు. దాంతో లిస్టులో పేర్లను మార్చి ఎస్సీలను చేర్చి కొత్త లిస్టు హడావుడిగా తయారుచేయించేరు.

శ్రీధర్‌కి ఇద్దామనుకున్న సీటు...రికార్డులు పరిశీలించగా అది రిజర్వుడు కోటాకి సంబంధించినదిగా బయటపడింది. కంపెనీ మసిపూసి మాయ చేయబోయి అడ్డంగా దొరికిపోయింది. ఎస్సీలో ఆ కేటగిరికీ చెందిన దానివి నువ్వే ఉన్నావు. ఎస్సీలకు సీనియారిటీలో ఒక ఏడాది సడలింపు ఉంటుంది కదా. దానితో నువ్వు అర్హత పొందేవు. అదృష్టం నిన్ను వరించింది.

ఇక్కడొక విషయం ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మన్ కూడా అధికారులతో పాటు వచ్చేరు. ఛైర్మన్ ఎవరో తెలుసా మీ నాన్న!

మీ నాన్న నీకు ఫేవర్‌గా చేసి ఉండొచ్చుగాక.

నీకు ప్రమోషన్ రావడం అనూహ్యమైనప్పటికీ... గుసగుసలకు పోయి ఏ ఒక్కరూ చెవులు కొరుక్కోలేదు. మేనేజర్ పోస్టుకి సరైన న్యాయం జరిగి, ఒక ప్రత్యేక శోభ చేకూరిందని భావిస్తూ ఉద్యోగులందరూ హర్షం ప్రకటిస్తున్నారు.

అదీ విషయం.

మరోసారి 'మేనేజర్ జయగారికి నా హృదయ పూర్వక అభినందనలు' అని తెలియజేసి నిష్క్రమించింది మీనాక్షి.

మళ్లీ నాన్న తెర మీదకొచ్చేదన్నమాట ఛైర్మన్ అవతారంతో.

పదోన్నతి విజేతల వేదికపై గర్వంగా నించున్న శ్రీధర్‌ని మానాన్న నిరంకుశం గా కాలర్ పట్టుకులాగేసి, తన అధికార దుర్వినియోగంతో నన్ను అందలమెక్కించా దన్న మాట.

నాకు అక్కరలేని ప్రమోషన్ ఇవ్వబడింది. మెడపట్టుకు వంచి దండవేయ బడింది.

దుఃఖం, బాధ, కోపం, అసహ్యం, రోత నాలో ముప్పిరిగొన్నాయి.

నాకొచ్చిన పదోన్నతిని ఆస్వాదించలేకపోయేను.

కంపెనీ యాజమాన్యం, మానాన్న, శ్రీధర్ వీళ్లంతా నా వ్యక్తిత్వాన్ని కించ పరుస్తూ నాతో దాగుడు మూతలు ఆడుతున్నారనిపించింది.

ఈ పదోన్నతిని ఏ మాత్రం భరించలేను. ఆమోదించలేను.

కాగితం కలం తీసుకున్నాను. యాజమాన్యానికి ఎడ్రస్ చేస్తూ 'మీరు దయతో నాకు ప్రసాదించిన పదోన్నతిని అంగీకరించలేకపోతున్నానని తెలియజేయడానికి విచారిస్తున్నాను' అని రాసి, సంతకం పెట్టి ప్రమోషన్ ఆర్డర్‌తో జత చేసాను.

ఎవరో ఎందుకూ, ఉదయం నేనే ఈ రిగ్రెట్ లెటర్ యాజమాన్యానికి అందజేస్తాను. అంతలో మరో ఆలోచన తళుక్కున మెరిసింది. రిగ్రెట్ లెటర్

ఎందుకూ... ఏకంగా రిజిగ్నేషన్ లెటర్ మేనేజ్‌మెంట్ ముఖాన కొట్టేస్తే సరి. బాబు సంరక్షణ కోసం... ఈ రోజుకాకపోయినా రేపైనా రాజీనామా చేయక తప్పదు కదా.

ఆలస్యం చేయకుండా, మరో ఆలోచనకు అవకాశం ఇవ్వకుండా కాగితం తీసుకుని రాజీనామా ఉత్తరం రాసేసాను.

తర్వాత శ్రీధర్ వచ్చేడు.

"జయా నాకు ప్రమోషన్ రానందుకు ఏమాత్రం వర్రీ కావడంలేదు. నన్ను నమ్ము. అంతేకాదు. నా ప్రియమైన డార్లింగ్‌కి సదరు ప్రమోషన్ వచ్చినందుకు పరమ సంతోషంగా ఉంది, అది కూడా నువ్వు నమ్మాలి. ఆ మాటకొస్తే ఆ కుర్చీలో కూర్చునే అర్హత నాకన్నా నీకే ఉందని నొక్కిచెప్పగలను. 'ఎస్, ఐ నో యువర్ కాలిబర్' అంటాడా. నా రాజీనామా ఉత్తరం చూసి షాక్ తినేసి 'వద్దు వద్దు అలాంటి పిచ్చిపని చేయొద్దు' అని వాదిస్తాడా..." ఇలాంటి ఊహగానాలు నేనేమీ చేయలేదు.

శ్రీధర్ ప్రవర్తన నన్ను నివ్వెర పరిచింది. ఎంతగానో బాధించింది.

ఈ రోజైనా... తను నాకు వచ్చిన ప్రమోషన్ గురించిగాని, తనకురాని ప్రమోషన్ గురించిగాని... ఏమాత్రం ప్రస్తావించకపోవడం విస్మయం కలిగించింది.

దుస్తులు మార్చి నేనిచ్చిన టీ తాగి, టీవి ముందు కూర్చున్నాడు.

పదోన్నతి విషయంలో తీవ్రంగా భంగపడ్డాడు అన్నది వాస్తవం. ఆ సమయంలో అతణ్ణి చూడగానే నాకేమయిందో తెలియదు. ఉన్నపాటున శ్రీధర్‌ని నా గుండెలపై అదుముకుని సేద తీర్చాలనిపించింది. ఓదార్చాలనిపించింది.

అతడు ఇంటికి వచ్చిన వెంటనే... కంపెనీ విషయాలు చెప్పకుండా దాచడం పై, అతని ప్రవర్తనపై నిలదీసి, విరుచుకుపడాలన్న విషయం అప్పుడు మర్చిపోయాను.

చివరికి నేనే కలగుజేసుకుని, తనకి ప్రమోషన్ రానందుకు విచారం వెలిబుచ్చేను.

"ఏదైనా మన మంచికే" అని ముభావంగా అన్నాడు.

నేనేదో అనబోతుంటే "దయచేసి ఆ విషయం ఎత్తకు" అన్నాడు చిరాగ్గా.

రాత్రి నన్ను దగ్గరకు తీసుకుంటాడేమో... అక్కడ సమస్త విషయాలు బయట పడి, చర్చింపబడి సర్దుకుంటాయేమోనని ఆశించేను. అందుకోసం ఎదురు చూసేను కూడా. ఏమీ లేకుండానే, చికాకుతో తెల్లవారింది.

ఉదయం వేగిరం శ్రీధర్ తయారవుతుంటే ఆఫీసుకి అనుకున్నాను. కాదు ఊరు బయల్దేరేడు.

ఎక్కడికి, ఎందుకు, సడన్‌గా ఏమిటీ ప్రయాణం– అని అడిగితే.

"ఇపుడు నన్నేమి అడక్కు. వెళ్లి వచ్చేక అన్నీ చెబుతాను" అని వెళ్ళిపోయేడు. ఏమైందీ మనిషికి?

ఈ మనిషేనా నా శ్రీధర్.

***

శ్రీధర్ హుషారుగా ఇంటి గుమ్మం తొక్కేడు.

'అయ్యో నిన్ను ఒంటరిగా వదలి వెళ్లిపోయేను నువ్వెలాగున్నావు. బాబు ఎలాగున్నాడు' అని అడగలేదు. నన్ను దగ్గరకు తీసుకోలేదు.

గబగబా సూట్‌కేస్ తెరచి... ఒక కవరు తీసి... నా చేతిలో పెట్టేడు. పూణేలో ఒక మల్టీ నేషనల్ కంపెనీలో పెద్ద ఉద్యోగం!

ఆ కాగితం చూసి ప్రమాన్పడిపోయేను. మిన్నకుండిపోయేను.

నేను అభినందనలు తెలపలేదు. సంతోషం ప్రకటించలేదు.

మంచో, చెడో ఏదైనా సరే నాతో చర్చించకుండా, తన జీవితభాగస్వామి అంటూ ఒకర్తి ఉందనే విషయం విస్మరించి, నిర్లక్ష్యం చేసి తనే ఒక నిర్ణయం తీసేసుకున్నాడు. ఒక ఎం.ఎన్.సికి అమ్ముడిపోయి వచ్చేడు. ఒక ట్రిప్ వేసుకుని, వెళ్ళి తెచ్చేసుకునేది కాదు ఇది. ఎంతో కరస్పాండెన్స్ ఈ మధ్య జరిగే ఉంటుంది. ఏ రోగమొచ్చిందని నాతో చర్చించలేదు. నాలుగ్గోడల మధ్య పడివుండే కట్టుబానిస ననుకున్నాడా. ఇదేకాదు, ఏ విషయమూ చెప్పడం మానుకున్నాడు. తేలిగ్గా తీసుకోవడానికి ఇవేమీ చిన్న విషయాలు కావు.

ప్రభుత్వ ఉద్యోగులు ప్రయివేట్ కంపెనీలలోకి దొంగచాటుగా దూకేయడమే తప్పా, నిజాయితీగా పనిచేస్తున్న కంపెనీ యొక్క ఆమోద ముద్రతో వెళ్ళరు.

శ్రీధర్ నాతోముందుగా చర్చించి ఉంటే... ఈ ఉద్యోగానికి ఎంకరేజ్ చేసి ఉండేదాన్ని కాదు. డబ్బులు బాగానే ఇస్తారు కాని రాత్రి, పగలు అనేతేడా లేకుండా మన శక్తిని మొత్తం పిండేస్తారు.

చాకిరీ–డబ్బు–చాకిరి. అదే జీవితం. పెళ్లం లేదు. పిల్లలూ లేరు. సుఖం లేదు. శాంతి ఉండదు. ఉద్యోగానికి గ్యారంటీ కూడా ఉండదు. ఎప్పుడయినా తీసేయవచ్చు. నేనైతే అలాంటి కంపెనీలో ఎంత జీతం ఇచ్చినా ఉద్యోగం చేయను.

శ్రీధర్ 'ఇది నా కొత్త ఉద్యోగం' అని ఇన్ఫర్మేషన్ ఇచ్చేడు తప్పా 'నీకు

ఇష్టమే కదా' అని అడగలేదు.

నీవింత హడావుడిగా పరుగులెట్టి కొత్త ఉద్యోగం తెచ్చుకున్నావే. ఎంచేత? నీకు అవుట్ ఆఫ్ ది వేలో ప్రమోషన్ ఇవ్వలేదనా? లేక అదే అవుటాఫ్‌దివేలో నీ పెళ్లం ముండకి ఇచ్చేరనా- అని అడగలేదు.

***

ఒక శుభ ముహూర్తాన శ్రీధర్ తన రాజీనామా ఉత్తరాన్ని తయారుచేసుకుని, నా రాజీనామా ఉత్తరాన్ని కూడా తనే తయారుచేసి, కేవలం నా సంతకం కోసం కాగితాన్ని నాముందు ఉంచేడు.

ఏమిటో! నా రాజీనామా వ్యవహారం కొన్నాళ్లుగా అటూఇటూ గెంతుతూ నాతో కోతి కొమ్మచ్చి ఆడుతోంది.

నా దగ్గర అప్పటికే ఒక రాజీనామా కాగితం ఉందన్న విషయం శ్రీధర్‌కి తెలీదు. ఆరోజు మీనాక్షి నా ప్రమోషన్ ఆర్డర్ తెచ్చినపుడు ఆవేశంగా రాసి పారేసిన రాజీనామా. అది మరుసటి రోజు శ్రీధర్ ఆఫీసుకి వెళితే ఇద్దామను కున్నాను. కాని బాబు ఊరెళ్లి బాంబు పట్టుకొచ్చేడు. అంచేత ఆ కాగితం భద్రంగా నా దగ్గరే ఉండిపోయింది.

శ్రీధర్ మరోసారి రాజీనామా ఉత్తరంపై సంతకం పెట్టమని ఒత్తిడి చేసేడు. 'బాంచను కాల్మొక్త' అన్న రీతిలో చిత్తం అంటూ సంతకం పెట్టేయాలన్న మాట.

సంతకం పెట్టలేదు నేను.

శ్రీధర్ నన్ను దగ్గరకు తీసుకుని, నా నడుం చుట్టూ చేతులు వేసి, నన్ను ప్రసన్నం చేసుకోవడానికి ప్రయత్నించేడు. అతని చేతులు మొగలినాగులా నన్ను భయపెట్టేయి. వదిలించుకుని బయటపడ్డాను.

సంతకం పెట్టడం అంటే యజమాని వెనుక గొర్రె నడవడం అన్నమాట. ఆఫ్‌కోర్స్ ఇప్పుడు నా పరిస్థితి గొర్రెకన్నా ఎక్కువకాదు.

నేను సంతకం పెట్టకపోవడంతో, అతనిలో అసహనం.

"నీ కొచ్చిన ప్రమోషన్ నీ సంతకాన్ని ఆపుతోందా?"

అదిగో! పుట్టలోంచి పాములా బయటకొచ్చేడు.

నా ప్రమోషన్ విషయం మొదటిసారిగా ప్రస్తావించేడు... అదీ వెటకారంగా, కసిగా. నాకు మండిపోయింది. కంట్రోల్ చేసుకున్నాను. సంతకం మాత్రం పెట్టలేదు. విసురుగా వెళ్లిపోయేడు.

***

ఆరోజు రాత్రి-

"ఉదయం నిన్ను హర్ట్ చేశాను క్షమించు" అన్నాడు శ్రీధర్.

ఆ పశ్చాత్తాపం చాలు నా శ్రీధర్‌ని దక్కించుకోవడానికి.

ముసిరిన మబ్బులు తొలగిపోయినట్లు ఇంటి వాతావరణం ప్రశాంతంగా ఉంది. చాలా రోజులకు ఆ రాత్రి మేమిద్దరం ఒక్కటయ్యాం.

నా మనసులో బరువు దించుకోవడానికి అదే మంచి సమయం అనిపించింది.

ఈ మధ్య తన ప్రవర్తన ఎంతగా బాధిస్తున్నదీ... సమస్తం ప్రస్తావించేను.

బాగానే స్పందించేడు. కుదుట పడ్డాను. సమాధాన పడ్డాను.

నాకొచ్చిన ప్రమోషన్‌ని స్వీకరించబోవడంలేదని చెప్పేను. విస్తుపోయేడు. నమ్మలేకపోయేడు.

'ప్రమోషన్‌పై కోపంతో ఏకంగా ఉద్యోగమే వదులుకుందామనుకున్నాను. అది తప్పే. నేను ఉద్యోగం వదులుకోను. ప్రమోషన్ మాత్రం తిరగ్గొడతా'నన్నాను.

దానిపై శ్రీధర్ నుంచి స్పందన లేదు.

చెప్పిన విషయాలే మళ్లీ మళ్లీ చెప్పుకున్నా చివరికి నా మనసులో మాట స్పష్టం చేశాను.

"శ్రీధర్ ప్రమోషన్‌పై మనం అలిగి ఒక మంచి కంపెనీని వదులుకోవడం మూర్ఖత్వం. ప్రమోషన్లు ఈరోజు కాకపోతే రేపు వస్తాయి. వస్తేరానీయ్ రాకపోతే పోనీయ్. మనం మాత్రం ఈ కంపెనీలోనే ఉందాం. ఏ కొత్త కంపెనీకి వెళ్లొద్దు. వాళ్లు ఎంత జీతమిచ్చినా సరే వెళ్లొద్దు. పరిగెత్తి పాలు తాగొద్దు. నిలబడి నీళ్లు తాగుదాం. ఇక్కడే మన జీవితాలను తృప్తిగా మలచుకుందాం. నాకు నువ్వు కావాలి బాబు కావాలి. ఉద్యోగం కూడా కావాలి. ఉద్యోగం చేయకుండా నేను ఉండలేను. బాబు సంరక్షణకు ఏదైన మంచి ఏర్పాటు దొరికే వరకూ సెలవులో ఉంటాను గాని ఉద్యోగాన్ని వదులుకోను ఏమంటావ్?"

నేను మాటాడుతునే ఉన్నాను. శ్రీధర్ నిద్రపోయేడు! ఎప్పుడు నిద్రపోయాడో మరి. ఏం మనిషి!

***

ఉదయం...యథాప్రకారం ఆఫీసుకి బయల్దేరాడు శ్రీధర్.

టేబుల్‌పై మా ఇద్దరి రాజీనామా ఉత్తరాలు... విడాకుల కాగితాలంత

క్రూరంగా భయంకరంగా కన్పించాయి నాకు.

సంతకం పెట్టని నా రాజీనామా కాగితాన్ని తీసి, శ్రీధర్ ముందే దాన్ని ముక్కలు ముక్కలుగా చించిపారేశాను.

శ్రీధర్ రాజీనామా కాగితాన్ని కూడా నేను చించేయబోతుంటే.. నానుంచి లాక్కున్నాడు. నా ముందు తనే ముక్కలు ముక్కలుగా చించి నన్ను తృప్తిపరుస్తాడా! లేదు తన రాజీనామాని చించేయలేదు. భద్రంగా మడిచి తన జేబులో పెట్టుకున్నాడు.

తెల్లబోయాను. గుండెల్లో గుబులు.

"అదేమిటి శ్రీధర్"

సమాధానంగా చిన్నగా నవ్వేడు అంతే.

క్షణం సేపట్లో నన్ను నేను సంబాళించుకున్నాను.

"సరే వెళ్లు" అన్నాను– శ్రీధర్ కళ్ళల్లోకి సూటిగా చూస్తూ.

వెళ్లిపోయేడు... శ్రీధర్ వెళ్లిపోయేడు... నానుంచి.

*(అరుణతార - జులై - సెప్టెంబర్ 2010)*